# దశరథమహారాజు

సముద్రముంటున్నాది. సముద్ర జలము మనము త్రాగినప్పుడు ఉప్పగా ఉంటుంది. కానీ, అదే జలము సూర్యుని యొక్క వేడిమిచేత ఆవిరిగా మారి, పైకి పోయి, మేఘములుగా తయారై, అక్కడనుండి వర్షబిందువులుగా వచ్చినప్పుడు తియ్యగా తయారౌతున్నది. ఈ మార్పు ఎక్కడ సంభవించింది? సూర్యుని యొక్క కిరణములచేత ఆవిరిగా మారుచున్నప్పుడు ఈ మాధుర్యము అక్కడ బయలుదేరింది. ఇప్పటి ఈ తియ్యదనమునకు, పూర్వపు ఉప్పదనమునకు ఉన్న వ్యత్యాసము గుర్తించుకోటానికి మనకు అవకాశముంది. ఈ తియ్యదనము అనుభవ జ్ఞానము. ఆ ఉప్పదనము శాస్త్రజ్ఞానము. శాస్త్రజ్ఞానము మనకు సంతృప్తినందించదు. అనుభవజ్ఞానమే మనకు ఆనందాన్ని అందిస్తుంది. మరి ఆ అనుభవము ఏరీతిగా కుదరాలి? భగవదనుగ్రహమనే సాధనతో, శాస్త్రజ్ఞానాన్ని బుద్ధి అనే కిరణముల ద్వారా ఆవిరిగా మార్చుకొని అనగా సూక్ష్మరూపముగా మార్చుకొని, సత్యమనే మేఘములుగా మనము తయారు చేయించుకున్నప్పుడు అందులోనుండి ప్రేమ అనే వర్షబిందువులు కురియును. ఈ ప్రేమబిందువులు ఒకదానికొకటి చేరినప్పుడు ప్రవాహము బయలుదేరుతుంది. ఈ ప్రవాహమే ఆనందము. ఈ ప్రవాహము నేరుగా పోయి అనుగ్రహమనే సాగరములో లీనమైపోతుంది. సముద్రమునుండి వచ్చిన జలము ఆవిరిగా మారి, మేఘములుగా మారి, వర్షముగా కురిసి, నదులుగా ప్రవహించి, తిరిగి ఆ సముద్రములోనే లీనమగు విధముగానే, ఈ ప్రేమ ప్రవాహముకూడా అనుగ్రహమనే సాగరములో లీనమవుతుంది. ఇది సరియైనటువంటి జీవితము.

ఈ సత్యమార్గమునందు ప్రవేశించినవాడు దశరథుడు. కోసల దేశమునకు 'అయోధ్య' ముఖ్యపట్టణము. మను చక్రవర్తి చేత స్వయంగా ఈ పట్టణం నిర్మించబడింది. ఇది అతి సుందరమైన పట్టణం. ఆనాడే ఏడు అంతస్తులు, ఎనిమిది అంతస్తుల మేడలు ఉండేవి. విశాలమైన వీథులతో అత్యంత సుందరంగా కనిపించేది అయోధ్య. ఈ భవనములు రత్నములచేత, ముత్యములచేత కూర్చబడి అలంకరించబడినవి. ఈ రాజ్యమునకు దశరథుడు మహారాజు. దశరథుడు శాంతమూర్తి, ప్రేమస్వరూపుడు, నిర్మల, నిశ్చల, నిష్కళంకస్వరూపుడు. సత్యపరాక్రముడని ఈ దశరథునికి బిరుదు. ధర్మవ్రతుడు అని మరొక బిరుదు కలదు. అతిరథి అని మూడవ బిరుదు. రాజర్షిఅనికూడను యితని నాల్గవ బిరుదు. ఈవిధమైన సర్వగుణములతోనూ ప్రకాశిస్తూ, ప్రకటిస్తూ, లోకమును పాలించేవాడు దశరథుడు. అతను ఎనిమిదిమంది అమాత్యులను ఆధారంగా తీసుకున్నాడు. అమాత్యులనగా ధర్మమును ఆచరించి, నిరూపించేవారు. వీరిలో చివరివాడే సుమంతుడు. ఇంక ఇరువురిని గురువులుగా ఉంచుకున్నాడు. వారే వసిష్ఠుడు, వామదేవుడు. వీరిని పురోహితులుగాకూడా ఉపయోగించుకొనే వాడు. ఇంతియేకాక, తనకు ఏదైనా సందేహము వచ్చినప్పుడు, ప్రజాక్షేమమునకు ఏదైనా అడ్డు తగిలినప్పుడు, ఇంకాఏమైనా అవాంతరములు వచ్చినప్పుడు ఆరుమంది ప్రధాన సలహాదారులను ఉంచుకునేవాడు. వారిలో మొదటివాడు సుయజ్ఞుడు, రెండవవాడు జాబాలి, మూడవవాడు కశ్యపుడు, నాల్గవవాడు కాత్యాయనుడు, ఐదవవాడు మార్కండేయుడు, ఆరవవాడు గౌతముడు. యావత్ భారతదేశమును ఏకచ్ఛత్రాధిపతిగా ఏలుతూ అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములనేవి యేమాత్రమూ తలెత్తకుండా అణగద్రొక్కి పరిపాలన చేస్తూ వచ్చాడు దశరథుడు. సత్యనిరతుడై ధర్మమార్గమందు ప్రవేశించి, పవిత్రమైన ప్రజాప్రేమను చూరగొన్నవాడు దశరథుడు.

దశరథుడనగా అంతరార్థమును కొంతవరకు మనము విచారణ చేయదలచుకున్నప్పుడు, కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు, ఈ రెండూకూడి దశేంద్రియములుగా ఉంటున్నాయి. ఈ దశేంద్రియములకు రథమైనటువంటి దేహమే దశరథుడు. సత్వగుణము, రజోగుణము, తమోగుణము అను ఆయన భార్యలు ముగ్గురు. ధర్మము, అర్థము, కామము, మోక్షము అను నాలుగు పురుషార్థములే ఆయన నలుగురు కుమారులు. ఈవిధమైన అంతరార్థములు ప్రపంచములో ప్రబోధించి, ఆదర్శమైన జీవితమును లోకానికి అందించినవాడు దశరథుడు.

అయోధ్యావాసులు నిరంతరమూ ధర్మప్రవృత్తులుగా, సత్యవాక్పరిపాలకులుగా అభివృద్ధిగాంచినారు. ఇట్టి పవిత్రమైన వాతావరణములో ఆడి, పాడి, కూడి, ఆనందించినటువంటి వారు అయోధ్యవాసులు. ప్రతి కర్మకు కూడను ప్రతిఫలమనేటువంటిది, ప్రతిబింబమనేటువంటిది ఉండక తప్పదు. దీనికి ఒక చక్కని ఆదర్శాన్ని నిరూపిస్తూవచ్చాడు దశరథుడు. అది యేమనగా, అతడు యవ్వనుడుగా ఉండే సమయమునందు వేటకై అరణ్యమునకు వెళ్ళాడు. రాత్రివేళయందు ఒక కొలనుకు సమీపములో, ఒక వృక్షముపైన చెవులు నిక్కబెట్టుకొని అతడు కూర్చొని ఉండగా, అర్ధరాత్రి సమయములో ఏదో ఒక బుడబుడ శబ్దము వినవచ్చినది. ఆ శబ్దము విన్న తక్షణమే, శబ్దభేదిని చక్కగా ఎరిగిన వాడు కనుక, ఆ శబ్దమును పురస్కరించుకొని అతడు బాణమును వదిలాడు. బాణము వదిలి, అతడు అక్కడికి వెళ్ళి చూడగా, ఒక ఋషి కుమారుడు మరణించి పడియున్నాడు. మరణించిన ఆ ఋషికుమారుని ఎత్తుకొనిపోయి అతని తండ్రి దగ్గర పెట్టి, తన తప్పును, తాను చేసిన పాపమును క్షమించి అనుగ్రహించమని ప్రార్థించాడు దశరథుడు. దుఃఖములో మునిగిన ఆ ఋషి, తన కుమారుని కళేబరమును దగ్గర ఉంచుకొని, అతి శోకముతో దశరథునితో, ' నీవు కూడను ఈవిధముగా అంత్యకాలమునందు, కుమారునియొక్క చింతతోనే మరణింతువు గాక!' అని శపించాడు. అంతవరకు సంతానము లేని దశరథుడు, ఆ ఋషి శాపవాక్యమును బట్టి తనకు సంతాన భాగ్యము కలదని భావించికొని, ఆనందించి, తెలిసి చేసిననూ, తెలియక చేసిననూ, చేసిన ప్రతి కర్మకూ ప్రతిఫలమును అనుభవించక తప్పదనేటువంటి సత్యాన్ని గుర్తించుకొని, తనయొక్క హృదయమును చల్లబరుచుకున్నాడు. దశరథుడు స్థితప్రజ్ఞుడైన రాజఋషి కనుక, దుఃఖమనేటు వంటిది ఆగంతుకమన్న సత్యమును గుర్తించుకున్నవాడై లోకమునకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించే నిమిత్తమై తాను అనేక రకములుగా, అనేక కాలములందు కొంత దుఃఖమును అనుభవిస్తూ వచ్చాడు. పుత్రులు లేరనే కొరత దశరథుని బాధిస్తుండేది.

ఒక పర్యాయం సుమంతుడు దశరథునిచేరి, 'రాజా! తమ స్నేహితుడు, అంగదేశపురాజు రోమపాదుని అల్లుడు, శాంత భర్తఅయిన ఋష్యశృంగుడు అనే మహాముని ఉన్నాడు. అతనిని పిలిపించి అశ్వమేధయాగము చేయించటం చాలా ఉత్తమం' బోధించాడు. మనస్సు చాలా విపరీతమైన స్వరూపాన్ని ధరించేటువంటిది. ఎన్ని జన్మలు మారినప్పటికిని మనస్సు స్వభావం మాత్రం మారదు. మనం అనేక రూపములను మార్చుకుంటున్నాము కాని, మనస్సును మాత్రం అన్ని రూపములందు ఒకే విధంగా ఉంటున్నది. ఈ మనసెప్పుడూ కోరకలనేటువంటి బీజములను నాటి, కర్మలనేటువంటి వృక్షములను పెంచి, అసంతృప్తి అనే ఫలములను భుజించి అశాంతిగా జీవితం గడపటమే దీని స్వభావం. కనుక, ఈ మనస్సుయొక్క స్వభావమును గుర్తించిన సుమంతుడు ఈ మహర్షిని పిలిపించి అశ్వమేధయాగమును చేయించాలన్నాడు. అశ్వమేధమనగా ఏమిటి? అశ్వమనగా చలించేటటువంటిది. 'మేధ' అనగా బుద్ధి. చలించే మనస్సును భ్రమింపచేయకుండా అరికట్టటమే అశ్వమేధ యాగము. ఈ క్రతువులోపల 'పుత్రకామేష్టి' అనే క్రతువుకూడా చేస్తే బాగుంటుందని రోమపాదుడు దశరథునికి సలహా యిచ్చాడు. సుమంతునితో కలిసి దశరథుడు స్వయంగా ఋష్యశృంగుని ఆహ్వానించటానికి 'అంగదేశం' వెళ్ళాడు.

అశ్వమేధయాగంతోబాటు పుత్రకామేష్టియాగంకూడా జరిపించాడు ఋష్యశృంగుడు. దైవము ప్రత్యక్షమై పాయసమును దశరథునికి అందించాడు. భక్తాభీష్టమును అనుగ్రహించేదానిలో భగవంతుడు చాలా సులభుడు. దశరథుడు నిజమైన భక్తుడు, నిర్మల హృదయుడు, నిస్వార్థపరుడు, దైవాన్ని హృదయములో యిముడ్చుకొని, నిరంతరమూ దైవచింతనలో కాలం గడిపేవాడు. సత్యధర్మములే తనయొక్క నేత్రములు. శాంతిప్రేమలే తనయొక్క సూత్రములు. దైవము ప్రసాదించిన పాయసమును పంచే విధానములో పండితులు అనేకరీతులుగా చెబుతూ వచ్చారు. దశరథునకు తన ముగ్గురి భార్యల మీద సమానమైన భావం ఉండేది. ఆ పాయసమును ముగ్గురికి సమానంగా పంచి యిచ్చాడు. ఈ విషయంలో దశరథుడు ఏవిధమైన భేదభావము చూపలేదు. సహజమైన, సంపూర్ణమైన, సంతోషకరమైన భావములు

అందరియందూ సమత్వమునే వహిస్తూ వచ్చాయి. ఆ యోగమే సమత్వాన్ని పెంచుతూ వచ్చింది. కైక ఈ పాయసమును ఆనందంగా అందుకొంది. కారణమేమనగా కైకను వివాహమాడుటకు పూర్వం, గర్గుడనే పురోహితుడు ఒక షరతు విధించాడు. అదేమనగా కైకకు పుట్టే కుమారునికే రాజ్యం పట్టాభిషేకం చేయాలని వాగ్దానం చేసినప్పుడే కైక, దశరథుని వివాహమాడుతుందని చెప్పాడు. పతులకు సతులయొక్క ప్రాణం అర్ధభాగమే కనుక, దశరథుడు యేమాటను యివ్వటానికి పూనుకొనక, ఇంటికి వచ్చి కౌసల్య, సుమిత్రలతో సంప్రదించగా, అప్పుడు ఆనందముతో వారు, 'నాథా! ఏ సంకోచము పెట్టుకోకండి. మనకు పుట్టేటటువంటి కుమారులు దేహబుద్ధులుగా ఉండేటువంటివారు పుట్టరు. కైకను వివాహమాడి పుత్రసంతానం పొందండి' అన్నారు. అప్పుడు కైకను వివాహం చేసుకున్నాడు దశరథుడు. ఆ వాగ్దానమును పురస్కరించుకొని తనకు పుట్టే వానికే ఈ రాజ్యం పట్టాభిషేకం చేస్తారని కైక చాలా సంతోషించింది. కౌసల్య ప్రథమ భార్య కనుక పట్టపురాణి. ఆమెకు పుట్టిన పుత్రుడే జ్యేష్టపుత్రుడు కనుక, అతనికే పట్టాభిషేక అర్హత అన్నారు. కాని, సుమిత్రకు ఎట్టి ఆశలు, వాంఛలు లేవు. ఆమె అందరితో మైత్రిగా ఉండేది. ఆమె శిరస్నానం చేసి మేడపైన తన కురులను అమర్చుకుంటూ పాయసం కప్పు అక్కడ పెట్టింది. ఈ లోపల ఒక గ్రద్ద వచ్చి ఆ కప్పును ఎత్తుకొనిపోయింది. భర్తకు ఎక్కడ కోపం వస్తుందోనని భయపడి, మేడ దిగి వచ్చి జరిగిన విషయమంతా కౌసల్య, కైకలకు చెప్పింది. అప్పుడు కైక తన కప్పులోని సగం పాయసం, కౌసల్య తన కప్పులోని సగం పాయసం సుమిత్ర కప్పులో పోశారు. కౌసల్య భాగమునుండి పుట్టినవాడు లక్ష్మణుడు, కైక భాగమునుండి పుట్టినవాడు శత్రుఘ్నుడు. రామునకు సరియైన సారథి లక్ష్మణుడు. ఉపనాయకుడు భరతుడు. భరతునకు తగిన సేవకుడు శత్రుఘ్నుడు.

ఒకానొక సమయమందు దూర్వాసుడు వసిష్ఠుల వారింటికి వచ్చినప్పుడు, ఈ దశరథుడు తనయొక్క వంశ ప్రమాణములను గురించి ప్రశ్నిస్తూ వచ్చాడు. తన వంశము ఏరీతిగా ఉండుననియు, తన వంశము సత్య మార్గము అవలంబించునా, లేదా అనియు, దూర్వాసుని ప్రశ్నిస్తూ వచ్చాడు. దూర్వాసుడు, ' తమకు పుట్టే పుత్ర రత్నములు ధర్మ ప్రవర్తన కలవారు. సత్యవాక్పరిపాలకులు, తండ్రి ఆజ్ఞ మీరనివారై, మీ వంశానికి శాశ్వత కీర్తి అందించేవారు అవుతారు' అని వారి సద్గుణములను అనేకవిధములుగా తెలిపాడు.

ఆనందమే స్వాభావికమని గుర్తెరిగినవాడు దశరథుడు. కనుకనే, ఆయన ఇంటిలో సాక్షాత్ నాలుగు వేదములూ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల ఆకారములతో ఆడుకుంటూ, తిరుగాడుతూ ఉంటున్నాయి. ధర్మమే ప్రధానమని, ధర్మమే ఆచరణయుక్తమని ప్రబోధలు సల్పు ఋగ్వేదమే రామచంద్రుడు. రామాజ్ఞనే యజ్ఞముగా భావించి, రామమంత్రమునే వల్లెవేయుచూ ఆనందమును అనుభవించుచున్నటువంటి లక్ష్మణుడే యుజుర్వేదము. రామనామమే పరమ తారకమని భావించి, నిరంతరమూ రామనామమునే గానము చేయుచున్నటువంటి భరతుడే, సామవేదము. ముగ్గురు అన్నల ఆజ్ఞను శిరసావహించి, అంతశ్శత్రువులను, బహిశ్శత్రువులను హతమార్చే శక్తి కలిగిన శత్రుఘ్నుడే, అధర్వణ వేదము. కనుక, ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణ వేదములు నాలుగూ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులుగా పవిత్రమైన దశరథునకు పుట్టినవి.

అయోధ్యకు విశ్వామిత్రుడు వచ్చాడు. అంత దశరథుడు ఆయనకు సకల మర్యాదలూ గావించి తమ రాకకు కారణమేమని విశ్వామిత్రుని అడుగగా, 'యాగ సంరక్షణ నిమిత్తమై శ్రీరాముని నాతో పంపాలి' అన్నాడు. అంతట దశరథుడు, 'విశ్వామిత్రా! వీరు పదునాలుగు సంవత్సరముల బాలురు. ఎండ కన్నెరుగని కుమారులు. వీరిని రాక్షస సంహారనిమిత్తమై పంపాలని నీవు ఆశిస్తున్నావు. వీరిని పంపుటకు వీలుకాదు' అన్నాడు. మొట్టమొదట మహర్షి అభీష్టాన్ని నెరవేరుస్తానని వాగ్దానం చేశాడు దశరథుడు. కాని యిలాంటి కోరికలు విశ్వామిత్రుడు కోరతాడని ఊహించ లేదు. దశరథుడు చాలా విచారగ్రస్తుడైనాడు. విశ్వామిత్రునికి కోపం అధికమౌతూ వచ్చింది. 'దశరథా! ఆడిన మాట తప్పటం ఇక్ష్వాకు వంశానికే అవమానకరం. ఈ వంశంలో అనాది కాలం నుండి అబద్ధం

ఆడినటువంటివారు లేరు. ఈనాడు మీరు అబద్ధం ఆడటం మీ వంశానికే తీరని కళంకం' అని విశ్వామిత్రుడు అనేటప్పటికి దశరథుడు చాలా భయపడ్డాడు. 'ఇచ్చిన వాగ్దానము తప్పేటువంటివారు లోకములో మహా పాపులు. నీవు అశ్వమేధయాగం చేశావు. పుత్రకామేష్టికూడా చేశావు. నీవు చేసిన వాగ్దానం తప్పటం చేత ఇవన్నీ వ్యర్థమైపోతాయి. మరచుటకన్న మరణమే మంచిది' అన్నాడు విశ్వామిత్రుడు. ఇంతలో వసిష్ఠులవారు ప్రవేశించారు. వీరిరువురి సంభాషణలు విన్నారు. 'దశరథా! మీరు ఆడిన మాట తప్పేటటువంటి వారు కాదు. ఈ బిడ్డలా! సామాన్యమైన వారు కాదు. సాక్షాత్ దైవస్వరూపులే. వీరు యేమౌతారోననే భయం మీకు అక్కరలేదు. సర్వలోక సమర్థుడైన ఈ రామచంద్రునికి ఎట్టి అపకారము జరగదు. సందేహించనవసరం లేదు. విశ్వామిత్రుని వెంట పంపు' అన్నాడు. అప్పుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపాడు.

ఇంద్రియ పటుత్వము తగ్గినప్పుడు రాజ్యమును పరిపాలన చేసే ఆధికారము లేదనే సత్యాన్ని లోకానికి చాటినటువంటి మహావ్యక్తి దశరథుడు. అతడొకనాటి రాత్రి నిద్రించు సమయమున, మధ్య రాత్రిలో అతనికి దాహము వేసింది. జగ్గులోనున్న మంచినీరు టంబ్లరులో పోసుకొని త్రాగటానికి యత్నించాడు. టంబ్లరులో నీరుపోయుచుండగా అతని చెయ్యి వణికినది. అది కారణంగా అతనికి మరల నిద్ర పట్టలేదు. తెల్లవారే వరకూ మేలుకొనే ఉన్నాడు. తెల్లవారిన తక్షణమే వసిష్ఠ వామదేవులను అవసరంగా పిలిపించి, 'గురూజీ! నాలోని ఇంద్రియములకు పటుత్వము తగ్గినది. రాజ్యపరిపాలనా శక్తి నాకిక లేదు. శ్రీరామచంద్రునికి పట్టాభిషేకము కట్టే ప్రయత్నము మీరిప్పుడే కావించవలెను' అని ప్రార్థించాడు. ఇంద్రియ పాటవము లేని వ్యక్తికి రాజ్యపరిపాలనాధికారము లేదనే సత్యాన్ని కూడను నిరూపించాడు. పరిపాలనా విధానమును, రాజనీతిని, ప్రభునీతిని, ప్రజానీతిని కూడను గుర్తించిన వాడు దశరథుడు. అంతేకాదు, ఏ వ్యక్తి అయిననూ దేశకాల పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని కర్తవ్యాన్ని నిర్వర్తించక తప్పదనే సత్యాన్ని కూడను అతడు చాటాడు. రామాయణమునందు రాముడు అరణ్యమునకు వళ్ళే సమయములో దశరథుడు చాలా బాధపడి దుఃఖించి, మూర్ఛనొందినట్లుగా కొంత దర్శిస్తూ వచ్చారు కానీ, దశరథుడు ఆ దుఃఖమును నిజముగా అనుభవించలేదు. 'ఇది మధ్య మార్గములో సంభవించిన దుఃఖము. ఇది కేవలము దేహమునకు మాత్రమే సంబంధించినది' అన్న సత్యమును ఆతడావిధముగా ప్రదర్శిస్తూ వచ్చాడు. రాముడు పుట్టక పూర్వము దశరథునికి కుమారుడు లేడు. కనుక, అప్పుడు కుమారునియొక్క ప్రేమగాని, కుమారునియొక్క అవస్థలుగాని ఏరీతిగా ఉంటాయో దశరథునికి ఏమాత్రమూ తెలియవు. కుమారుడు పుట్టిన తరువాతనే అతని కష్టనష్టములు, సుఖదుఃఖములు తండ్రికి కొంతవరకు అర్థమవుతుంటాయి. కనుక, కుమారునియొక్క దుఃఖము అతడు పుట్టిన తరువాత మధ్యలో వచ్చినదేగానీ, తండ్రికి స్వాభావికమైన దుఃఖము కానేరదు. ఇట్టి సత్యాన్ని గుర్తించినవాడు కనుకనే దశరథుడు, రామచంద్రుడు అరణ్యమునకు పోయే సమయములో తాను చక్కగా ఆశీర్వదించి, అరణ్యములో ఎట్టి అవాంతరములు కూడను గురికాకుండా ఉండాలని, అతి శీఘ్రకాలము లోపలనే నీవు అయోధ్య వచ్చి చేరాలని, క్షేమముగా నీవు అరణ్య వాసము చేసి రమ్మనమని, సర్వవిధములా నీ ధర్మమే నిన్ను రక్షిస్తుందని కూడను ఆశీర్వదించి పంపించినటువంటి మహావీరుడు ఈ దశరథుడు. 'తండ్రి అసత్య దోషమునకు గురికాకుండా ఉండే నిమిత్తమై సత్యాన్ని పాటించి జగత్తుకు ఆదర్శవంతమైన జీవితాన్ని నిరూపించే నీకు, ఎట్టి కష్టములు ప్రాప్తించకుండుగాక!' అని కూడను ఆశీర్వదించాడు దశరథుడు.